సాక్షి జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



మినీ జాతరకు వేళాయె..

మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర (మండమెలిగె పండుగ)కు వేళయింది. నేటి(బుధవారం) నుంచి పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. - 8లో▸



పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

అధ్యాపకులు పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ.. అకాడమిక్ పరంగా ముందుకెళ్లాలని కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అధ్యాపకులకు సూచించారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $34.0^0/19.1^0$

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మహా కుంభాభిషేకానికి స్పెషల్ బస్సులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో కాళేశ్వరం దేవస్థానంలో జరిగే మహా కుంభాభిషేకానికి మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపిస్తున్నట్లు డీఎం జనార్దన్ తెలిపారు. మంగళవారం ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని బట్టి బస్సులు నడిపిస్తామన్నారు. ఇప్పటికే నిత్యం పదుల సంఖ్యలో మంచిర్యాల టు కాళేశ్వరం బస్సులు నడుస్తున్నట్లు 'సాక్షి'తో తెలిపారు.

10న నులి పురుగుల నివారణ దినోత్సవం

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించి పలు ఆదేశాలు జారీచేశారు. నులిపురుగుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మాత్రలు వేయాలని చెప్పారు. నులిపురుగులు పేగుల్లో ఉండి రక్తాన్ని పీల్చుకుంటాయని తద్వారా పిల్లల్లో రక్తహీనత ఏర్పడుతుందన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



భూపాలపల్లి అర్బన్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ డీలర్లకు కనీస వేతనం అమలు చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం రాధాకృష్ణ కోరారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రతీ నెల కనీస వేతనం రూ.5వేలు అమలు చేయాలని, క్వింటాల్‌కు కమీషన్ రూ.300 ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో రేషన్‌డీలర్లు రాజేంద్రప్రసాద్, సురేష్, జయప్రకాశ్, కృష్ణారెడ్డి, సుధాకర్, సాంబయ్య, వెంకన్న, లచ్చన్న, శంకర్ పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



భూపాలపల్లి రూరల్: పేద, మధ్యతరగతి ప్రజల, ఉద్యోగుల కలల బడ్జెట్‌ను బీజేపీ ప్రభుత్వం ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రవేశపెట్టిందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నిశిధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు బడ్జెట్‌పై అవగాహన లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం యుగంధర్, రాష్ట్ర నాయకుడు బట్టు రవి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎరుకల గణపతి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలిఫ్ ,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జగ్గయ్య నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సిబ్బంది అందుబాటులో ఉండాలి

వాజేడు: వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతి కుమార్ ఆదేశించారు. కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓల ఆదేశాల మేరకు వాజేడు పీహెచ్‌సీని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు రోగుల గదులు, మందుల వివరాలపై ఆరా తీశారు. సిబ్బంది వైద్యశాలలో అందుబాటులో లేరనే విషయం పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది, వైద్యాధికారి సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రిలో ఇటీవల ప్రసవం పొందిన తల్లీబిడ్డ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశ డే సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో రక్తపోటుతో బాధపడుతున్న వారికి ఆశ వర్కర్లు నెలవారీగా మందులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్, కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఖలీల్, వెంకటరమణ, మంగ, రఘు, శేఖర్, శ్రీనివాస రావు, నాగేంద్ర కుమారి, సత్య నాగవేణి పాల్గొన్నారు.

మారట్లేరు..



పెరుగుతున్న డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- పట్టుబడుతున్న వారిలో యువకులే అధికం
- తేలిగ్గా తీసుకుంటున్న వాహనదారులు
- జరిమానాలు.. జైలు శిక్ష

జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల వివరాలు

	2023	2024
కేసులు	1,260	2,460
జైలు శిక్షలు	04	18
జరిమానాలు	రూ.8లక్షలు	రూ.10లక్షలు
రోడ్డు ప్రమాదాలు	196	223
మృతుల సంఖ్య	90	79

భూపాలపల్లి అర్బన్: మద్యం తాగి వాహనాలు నడపొద్దని పోలీసులు పదేపదే చెబుతున్నారు. అయినా కొందరు వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. అదే పనిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్లపైకి వస్తున్నారు. మత్తులోనే ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మద్యం తాగి వాహనం నడిపేవారిని పట్టుకునేందుకు పోలీసులు తనిఖీలు విస్తృతంగా చేసినా కొందరు వాహనాదారులు బెదరడం లేనేలేదు.

పాయింట్ల ఆధారంగా శిక్ష

2024 జనవరి నుంచి గత డిసెంబర్ వరకు జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు 2,460 నమోదు కాగా, రూ.10లక్షలకు పైగా జరిమానా విధించారు. 1,753 మందిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా 18 మందికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బ్రీతింగ్ అనలైజర్ యంత్రాలతో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. వీటి పైపును నోటిలో పెట్టుకుని గట్టిగా గాలి ఊదితే ఎంత పరిమాణంలో మద్యం సేవించినది నమోదవుతుంది. ఆల్కహాల్ శాతం 30 కంటే ఎక్కువ ఉంటే మద్యం తాగినట్లుగా నిర్ధారణకు వచ్చి పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. 100 పాయింట్లు దాటితే వాహనాలు స్వాధీనం చేసుకుని, కేసులో శిక్షపడిన తర్వాత దానిని తిరిగి అప్పగిస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల సమయంలో యువతే పోలీసులకు పట్టుబడుతోంది. ఎక్కువగా 18 నుంచి 24ఏళ్ల మధ్య వయసు వారిని పోలీసులు గుర్తించారు. బ్రీతింగ్ అనలైజర్‌లో ఏ సమయంలో పరీక్ష చేశారు, ఎంత పరిమాణంలో మద్యం తాగారనే పూర్తి వివరాలు నమోదవడం ద్వారా కేసు విచారణలోనూ జాప్యం ఉండదు. ఒకటికన్నా ఎక్కువసార్లు మద్యం తాగి ఆ మత్తులో పోలీసులకు పట్టుబడితే వాహనదారు లైసెన్స్ రద్దుచేసే అవకాశం ఉంటుంది.

తాగి నడిపితే బీమా వర్తించదు..

మద్యం తాగి వాహనం నడపడం నేరమైనా కొందరు తేలిగ్గా తీసుకుంటున్నారు. నిర్లక్ష్యంగా ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇలాంటి వారంతా ఇకపై వాహన బీమా ప్రయోజనాలు పొందలేరు. ఎందుకంటే మద్యం తాగి వాహనం నడిపినట్లు కేసులు నమోదై అనర్హులుగా గుర్తింపు పొందుతారు. గతంలో పోలీసులకు ప్రమాదానికి కారకులను గుర్తించడం, ఆధారాలు సేకరించడం కష్టంగా ఉండేది. ఇటీవల ప్రమాదాలు జరిగిన వెంటనే వాహనదారుల నుంచి రక్తనమూనాలు తీసుకుంటున్నారు. ఒకవేళ చనిపోతే జీర్ణాశయం నుంచి నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీకి పంపిస్తున్నారు. మద్యం తాగి వాహనం నడిపినట్లు శాస్త్రీయంగా నిరూపించి బీఎన్ఎస్ సెక్షన్ 185 ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తున్నారు. ఫలితంగా ప్రమాద సమయంలో మరో వాహనదారుపై కేసు లేకుండా పోవడంతోపాటు మృతుడికి సంబంధించిన బీమా ప్రయోజనాలు, కేసుకు సంబంధించిన పరిహారం దక్కకుండా పోతాయి. దీంతో వీరిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఆర్థికంగా తీరని నష్టాన్ని, కష్టాన్ని చవిచూడక తప్పదని అధికారులు వివరిస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపడం నేరం



మద్యం తాగి వాహనం నడపడం నేరం. పట్టుబడితే రెండు రోజుల నుంచి నెల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. తనిఖీల్లో పట్టుబడిన వారికి పోలీసులు, వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపకూడదు. ఈసందర్భంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తున్నాం.

\- కిరణ్‌ఖరే, ఎస్పీ

క్రీడలతో మానసికోల్లాసం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

భూపాలపల్లి: ఉరుకులు పరుగుల జీవితంలో క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణబాబు అన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం జెన్‌కో–జ్యుడిషియరీ టీంల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే, జెన్‌కో చీఫ్ ఇంజనీర్ ప్రకాశ్, న్యాయమూర్తులు జయరాంరెడ్డి, రామచంద్రారావు, అఖిల పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయయూర్తి పి.నారాయణబాబు, ఎస్పీ

పెరగనున్న ఎంపీటీసీ స్థానాలు



పలిమెల: మండలంలో మూడు ఎంపీటీసీ స్థానాలు పెరగనున్నాయి. మండలంలో మొత్తం 8 జీపీలకు గాను గతంలో పలిమెల ఎంపీటీసీ పరిధిలో పలిమెల, పంకెన, మోదేడు, లెంకలగడ్డ ఉండగా, సర్వాయిపేట ఎంపీటీసీ పరిధిలోని సర్వాయిపేట, దమ్మూరు, నీలంపల్లి, ముకునూరు గ్రామ పంచాతీయలు కొనసాగేవి. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలు, అవసరం మేరకు మూడు జీపీలు దమ్మూరు, ముకునూరు, నీలంపల్లిలకు ఒక ఎంపీటీసీగా, లెంకలగడ్డ, మోదేడులకు ఎంపీటీసీ, పంకెన, పలిమెల, సర్వాయిపేట జీపీలకు గాను మూడు ఎంపీటీసీ స్థానాలుగా నిర్ణయించి మొత్తం ఐదు ఎంపీటీసీ స్థానాలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

పలిమెల మండలంలో గతంలో పలిమెల, సర్వాయిపేట రెండు ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రభుత్వ ఆదేశానుసారం మరో మూడు ఎంపీటీసీ స్థానాలను అదనంగా పెంచడం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే ప్రభుత్వ సూచనలు, మార్గదర్శకాల మేరకు ఎంపీటీసీ స్థానాల పెంపుపై ప్రకటన వెలువడనుంది.

\- శ్రీనివాస్, ఎంపీడీఓ, పలిమెల

రథసప్తమి వేడుకలు

కాళేశ్వరం: రథసప్తమి సందర్భంగా కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయం శ్రీసూర్యానారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి మంగళవారం ప్రత్యేకంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంటెండ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కామిడి రాంరెడ్డి, మాజీ ధర్మకర్తలు అశోక్, శ్యాంసుందర్ దేవుడా, నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, శనిగరం శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సూర్యదేవాలయంలో పూజ చేస్తున్న అర్చకుడు



కోటంచలో సూర్యవాహనసేవ

రేగొండ: రథసప్తమి సందర్భంగా మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం బుచ్చమాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాడ వీధులగుండా సూర్యవాహన సేవ నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ, ఆరగింపు కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనాథచార్యులు. ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, రాజు, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

- కుంభాభిషేకం ఘనంగా నిర్వహిస్తాం
- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: కాళేశ్వరంలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కుంభాభిషేకం మహోత్సవాల నిర్వహణపై మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో దేవాదాయ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య, ఇరిగేషన్, పోలీస్, అగ్నిమాపక, ఆర్టీసీ, సమాచారశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం బస్టాండ్ నుంచి గోదావరి నది వరకు, బస్టాండ్ వద్ద గల దేవస్థానం ఆర్చి గేటు నుంచి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట గల ఆర్చ్ గేట్ వరకు, దేవస్థానం బయట ఆవరణ, వీఐపీ, ప్రధాన ఘాట్‌ల వద్ద ప్రత్యేక స్వీపర్లను నియమించి ప్రతీరోజు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చాలని సూచించారు. 9వ తేదీ ఉదయం 10.42 గంటలకు కుంభాభిషేకం చేయుటకు పీఠాధిపతులు, వేద పండితులు, వీఐపీలు గోపురాల పైకి, ప్రధాన దేవాలయం పైకి వెళ్లాల్సి ఉందన్నారు. ఆ సమయంలో రద్దీతో భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించాలని సూచించారు. మత్స్యశాఖ ద్వారా గోదావరినది వద్ద 10మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకరమైన స్థలాలను గుర్తించి ప్రమాద హెచ్చరికల ఎర్రజెండాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. గోదావరి నదిలో డేంజర్ జోన్లను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు నడిపించాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ బోనాల కిషన్, డీపీఓ నారాయణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.



జిల్లా అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మొగుళ్లపల్లి : మండలకేంద్రానికి కేటాయించిన అంబులెన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని 108 జిల్లా మేనేజర్ నరేష్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు, 108, 102 నియంటల్, ఎఫ్‌హెచ్ఎస్ సర్వీస్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం కుష్ఠువ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బందితో వైద్యాధికారి నాగరాణి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది కటుకూరి శ్రీనివాస్, బండి సురేష్, శీలపాక రాజు, సాగర్, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా మేనేజర్ నరేష్

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కేంద్ర బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై వైద్యాధికారి ఆడెపు చిరంజీవిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పీహెచ్‌సీలో మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం మేడారంలో ఆయూష్ ఆరోగ్య మందిర్ సబ్ సెంటర్‌ను సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు మురుగన్, శెంథిల్, చంద్రకాంత్ పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో కేంద్ర బృందం

అడవికి నిప్పు పెట్టొద్దు

వాజేడు: అడవికి నిప్పుపెడితే మానవ మనుగడకు ముప్పు తప్పదని ఎఫ్ఎస్ఓ నారాయణ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్ప పువ్వు, బీడీ ఆకు సేకరించడానికి అడవికి వెళ్లిన ప్రజలు చెట్లకింద సేద తీరే సమయంలో పొరపాటున కూడా నిప్పు పెట్టవద్దన్నారు. నిప్పు పెడితే అడవి కాలిపోవడంతో పాటు వన్య ప్రాణులు మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మినీ జాతరలకు ఆర్టీసీ బస్సులు

ఏటూరునాగారం: జిల్లాలోని మినీ మేడారం, కొండాయి, ఐలాపురంలో జరిగే జాతరలకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు వరంగల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ విజయభాను మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9నుంచి 16వ తేదీ వరకు హనుమకొండ నుంచి మేడారం జాతరకు వంద బస్సులు, 400 ట్రిప్పులు నడుపనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6గంటల నుంచి సర్వీసులు మొదలవుతాయని వివరించారు. ఐలాపురం, కొండాయి జాతరకు ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి, కొండాయి, ఐలాపురం వరకు బస్సులను నడుపుతామని తెలిపారు. ఈ గ్రామాల వరకు మూడు బస్సు సర్వీసులు నడుస్తాయని భక్తులు, ప్రయాణికులు గమనించాలని కోరారు.

విదేశీయుల సందడి



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని మంగళవారం ఇంగ్లాండ్‌కు చెందిన కార్ల్, లిన్‌లు సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని వారు దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పకళ సంపద బాగుందని కొనియాడారు.

ఇన్సెంటివ్ ప్రకటనతో హర్షం

భూపాలపల్లి అర్బన్: వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తే కార్మికులు, ఉద్యోగులకు ఇన్సెంటివ్ చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బెతెల్లి మధుకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలల క్రితం ఏరియాలో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఐఎన్‌టీయూసీ స్ట్రక్చర్ కమిటీ సభ్యులు షేక్‌హుస్సేన్, బొడ్డు అశోక్ ఆధ్వర్యంలో ఏరియా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించి కార్మికులు ఇన్సెంటివ్‌ను అందుకోవాలని పిలుపునిచ్చారు.

చేపల కోసం పోటీ..

మండల పరిధిలోని రామప్ప సరస్సులోకి గోదావరి నీటిని పంపింగ్ చేసే దేవాదుల పైపులైన్ పాయింట్ వద్ద చేపల కోసం స్థానికులు పోటీ పడ్డారు. 15 రోజులుగా రామప్ప సరస్సులోకి నీటిని పంపింగ్ చేసిన నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం మోటార్లను నిలిపివేశారు. దీంతో దేవాదుల పైపులైన్ పాయింట్ వద్ద పెద్ద ఎత్తున చేపలు ఎగురుతుండడంతో స్థానికులు గమనించి వలలు, దోమతెరలతో చేపలు పట్టారు. చేపలు పెద్ద ఎత్తున అందరికీ దొరకడంతో ఆనందం వ్యక్తం చేశారు.

\- వెంకటాపురం(ఎం)



సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం సులువు

● మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల


డ్రోన్ స్ప్రేయర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్మల

వరంగల్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం వల్ల వ్యవసాయంలో సులువుగా పనులు చేయొచ్చని వరంగల్ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల అన్నారు. మార్కెట్‌లోని మన అగ్రిటెక్‌లో మంగళవారం డ్రోన్ స్ప్రేయర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో మానవ లోకం ఎంతో ముందడుగు వేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం చే ఆమోదించిన ప్రముఖ దక్ష కంపెనీ రూపొందించిన డ్రోన్ స్ప్రేయర్లను రైతులకు మన అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేశ్ అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మన అగ్రిటెక్ ఎండీ రమేశ్ మాట్లాడుతూ.. డ్రోన్ 10 లీటర్ల నీటి సామర్థ్యంతో ఎకరా కేవలం 5–7నిమిషాల వ్యవధితో పిచికారీ చేస్తుందని, ఒకసారి బ్యాటరీ చార్జ్ చేస్తే 3ఎకరాల వరకు పనిచేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రావు, నూతనకల్ పీఏసీఎస్ చైర్మన్ జయసుధ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో బాలికపై లైంగికదాడి

● గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి..
● తల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు

ఖిలా వరంగల్: బాలికను ప్రేమపేరుతో ఓ యువకుడు లైంగికంగా లోబర్చుకున్నాడు. చివరికి ఆమె గర్భవతి కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మంగళవారం వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతానికి చెందిన బాలిక (16) ఇంటర్మీడియట్ చదువుతోంది. కాలేజీకి వెళ్లి వచ్చే క్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆదిల్ (20), బాలిక మధ్య పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త రెండేళ్లుగా ప్రేమగా మారింది. కొద్ది నెలలుగా ప్రేమ, పెళ్లి పేరుతో ఆ బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలికకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తల్లిదండ్రులు వైద్యులకు చూపించగా గర్భవతి అని తేలింది. ఈవిషయంపై తల్లిదండ్రులు బాలికను నిలదీయడంతో విషయం చెప్పింది. మంగళవారం మిల్స్‌కాలనీ పీఎస్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించగా గర్భవతని తెలిసింది. ప్రేమ, పెళ్లి పేరుతో లైంగికదాడికి పాల్పడి బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

పోలీసుల అదుపులో యువకుడు..

ప్రేమ,పెళ్లి పేరుతో బాలికకు లైంగికంగా దగ్గరై గర్భవతిని చేసిన యువకుడిని మంగళవారం సాయంత్రమే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

మార్కెట్‌లో మౌలిక వసతులేవి?

● వైఫై, పీఓఎస్ మిషన్లు లేక ఇబ్బందులు
● మొక్కుబడిగా వైద్యసేవలు
● వసతులు కల్పించాలని అడ్తి వ్యాపారులు, ఖరీదుదారుల ధర్నా
● రెండు గంటల పాటు నిలిచిన కాంటాలు, క్రయ,విక్రయాలు
● అధికారుల హామీతో ధర్నా విరమణ.. కొనసాగిన మిర్చి కొనుగోళ్లు


మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారులు


కాంటాలు నిలిచిపోవడంతో బస్తాలపై కునుకు తీస్తున్న రైతులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్.. ఆసియా ఖండంలోనే అతిపెద్దది. ఇక్కడికి రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ పంట సరుకుల విక్రయానికి వస్తారు. తమ పంట ఉత్పత్తుల విక్రయాలకు రైతులు.. కొనుగోలు చేసేందుకు వందలాది మంది వ్యాపారులు.. కాంటాలు వేసేందుకు దడవాయిలు, హమాలీలు, కార్మికులు.. ఇలా మొత్తం సుమారు రెండు వేల నుంచి ఐదు వేల మంది వరకు నిత్యం మార్కెట్‌కు వస్తుంటారు. ఈ క్రమంలో ఇంతటి ప్రాధాన్యం కలిగిన మార్కెట్‌లో మౌలిక వసతులు లేవంటూ మంగళవారం అడ్తి వ్యాపారులు, ఖరీదుదారులు మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ ధర్నాతో కాంటాలు నిలిచిపోయాయి. దీంతో మిర్చి కొనుగోళ్లు నిలిచాయి. సోమవారం అడ్తివ్యాపారి కడారి సదానందం మార్కెట్‌లోని ఓ హోటల్ వద్ద టీ తాగుతూ గుండెపోటుతో మృతి చెందాడు. అతడి మృతికి సంతాపం వ్యక్తం చేసిన అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ యార్డులలో క్లీనింగ్ లేకపోవడం, రవాణా వాహనాలు, మిర్చి ఘాటుతో గుమస్తాలు, దడువాయిలు, రైతులు, హమాలీ కార్మికులు, వ్యాపారులు అనారోగ్యంతో చనిపోతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో బాధితులకు చికిత్స చేయడానికి 24 గంటలు మార్కెట్‌లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్నారు. అలాగే, మార్కెట్‌లో వైఫై లేక పీఓఎస్ యంత్రాలు సరిగా పనిచేయడంలేదన్నారు. ఫలితంగా కాంటాలు ఆలస్యం కావడం, చోరీలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీంతో మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు సమకూర్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు లిఖితపూర్వకంగా విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల ఘటనాస్థలికి చేరుకుని మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం కాంటాలు జరగడంతో యథావిధిగా మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో చాంబర్ ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లే సంపత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వసతుల కల్పనపై జేడీఎం సమీక్ష..

మార్కెట్‌లో మౌలిక వసతులపై వ్యాపారులు ధర్నా నిర్వహించడంతో మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్, జేడీఎం శ్రీనివాస్ అధికారులతో సమావేశమయ్యారు. ఉన్నతాధికారుల అనుమతితో మార్కెట్‌లో వసతులు కల్పిస్తామని చాంబర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. సమీక్షలో మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల, ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, గ్రేడ్ 2 కార్యదర్శులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పీఓఎస్ మిషన్లు సమకూర్చాలి



మార్కెట్‌లో 120 మంది దడవాయిలం ఉన్నాం. ప్రస్తుతం 40 పీఓఎస్ మిషన్లు మాత్రమే పనిచేస్తున్నాయి. 80 మిషన్లు వస్తున్నాయని రెండేళ్లుగా అంటున్నారే తప్పా రావడం లేదు. కార్యదర్శి 10 మిషన్లు వచ్చాయని చెప్పారు. వాటిలో యాప్ ఇన్‌స్టాల్ చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి.

–సోల రవి, దడవాయి యూనియన్ సెక్రటరీ

సౌకర్యాలు కల్పించాలి



మార్కెట్‌లో ఎండ వేడి తట్టుకోలేకపోతున్నాం. విశ్రాంతి భవనంలో వసతులు సమకూర్చాలి. మూత్రశాలలు శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే, మార్కెట్‌లోని మెడికల్ సెంటర్‌లో వైద్య సౌకర్యాలు కల్పించాలి.

–పసునూటి మల్లయ్య, రైతు, ఇల్లంతకుంట మండలం, కరీంనగర్

తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలి



మార్కెట్‌లో యార్డు చుట్టూ నల్లాలు ఉన్నా నీళ్లు సరిగా రావడం లేదు. లోపలకు వెళ్తే ఎందుకు వస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సౌకర్యం మెరుగుపర్చాలి. కార్మికులు అస్వస్థతకు గురైతే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి. అంబులెన్స్ ఉంటే వ్యాపారి బతికేవాడు.

–అప్సర్ హమాలీ కార్మికుడు

మార్కెట్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి



నిత్యం వేలాది మంది రైతులు, వ్యాపారులు, కార్మికులు ఉండే మార్కెట్‌లో వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీ(బస్తీ దవాఖాన)ఏర్పాటు చేయాలి. గుండెపోటుకు గురైన వ్యాపారిని సకాలంలో 108లో ఆస్పత్రికి తరలిస్తే బతికేవాడు.

–డి.కరుణాకర్, గుమస్తాల సంఘం నాయకుడు

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి దుర్మరణం

● మేడ్చల్‌లో ఘటన..
మృతుడు శనిగపురం వాసి


శ్రీచరణ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వైద్యుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటనతో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాస్, వాణి దంపతుల పెద్ద కుమారుడు శ్రీచరణ్ (26) మేడ్చల్ జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్తుండగా మేడ్చల్ జిల్లా కేంద్రంలోని క్రాస్ వద్ద కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీచరణ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసి మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంటనే మేడ్చల్ వెళ్లారు.

ఇంటికి నీళ్లు కొడుతుండగా..

● విద్యుదాఘాతంతో యువకుడి మృతి
● రాయికుంట తండాలో ఘటన


సతీశ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఇంటికి నీళ్లు కొడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ మండలం ఉత్తర తండా జీపీ పరిధిలోని రాయికుంట తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బోడ రాంసింగ్, బుజ్జి దంపతులు నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ దంపతుల చిన్నకుమారుడు సతీశ్ (23) స్విచ్ బోర్డుకు విద్యుత్ తీగలను అమర్చి కొంత సమయం తర్వాత మోటారు ఆన్ చేసి ఇంటికి నీళ్లు కొడుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ వైరు కిందపడగా తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు రూరల్ ఎస్సై దీపిక తెలిపారు. మృతుడికి భార్య బిందు, మూడు నెలల కుమార్తె ఉంది.

మినీ జాతరకు వేళాయె..

● నేడు మేడారం, కన్నెపల్లిలోని ఆలయాల్లో గుడి మెలిగె పండుగ
● వనదేవతల జాతరకు ఏర్పాట్లు సిద్ధం


కన్నెపల్లిలోని సారలమ్మ గుడి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర(మండమెలిగె పండుగ)కు వేళయింది. నేటి(బుధవారం) నుంచి పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ఇందులో భాగంగా మేడారంలోని సమ్మక్క గుడి, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో గుడిమెలిగె పండుగ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమ్మక్క పూజారులు ఉదయం సమ్మక్క గుడికి చేరుకుని అమ్మవారి వస్త్రాలు, పూజ సామగ్రిని శుద్ధి చేస్తారు. గుడిని శుద్ధి చేసిన తర్వాత సిద్ధబోయిన మునిందర్ ఇంటి నుంచి పూజారులు, ఆడపడుచులు డోలివాయిద్యాలతో పసుపు, కుంకుమ తీసుకుని సమ్మక్క గుడికి వెళ్తారు. గుడిలో అప్పటికే పూజారి కొక్కెర కృష్ణయ్య అలికి సిద్ధంగా ఉంచిన అమ్మవారి శక్తిపీఠంపై ఆడపడుచులు ముగ్గులు వేసి అలంకరిస్తారు. అనంతరం అడవి నుంచి తీసుకొచ్చిన ఎట్టిగడ్డిని సమ్మక్క గుడి భవనం ఈశాన్యం మూలన పెడతారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని సారలమ్మ పూజారులు, ఆడపడుచులు కలిసి శుద్ధి చేస్తారు. అమ్మవారి గుడిలో, ఆవరణలో ముగ్గులు వేస్తారు. సారలమ్మ వస్త్రాలు, పూజ సామగ్రిని ప్రధాన పూజారి సారయ్య శుద్ధి చేస్తారు. సారలమ్మ వద్దె కుండలను పసుపు, కుంకుమతో ఆడపడుచులు అలంకరిస్తారు. అనంతరం గుడిలో పూజారులు అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. మండమెలిగె పండుగకు వారానికి ముందు గుడిమెలిగె పండుగను నిర్వహిస్తారు. ఈనెల 12వ తేదీన (బుధవారం) మేడారం, కన్నెపల్లిలో మండమెలిగె పండుగ నిర్వహించనున్నారు. గుడిమెలిగె పండుగతో పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి.

జాతరకు ఏర్పాట్లు సిద్ధం..

మినీ మేడారం జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని అధికారురులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. జాతరలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క.. అధికారులను ఇప్పటికే పలుమార్లు ఆదేశించారు. దీంతో కలెక్టర్ దివాకరటీఎస్ జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారు. జాతర సమీపిస్తుడడంతో అధికారులు మిగిలిన పనులన్నీ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే, ఎస్పీ శబరీశ్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీస్‌శాఖ పకడ్బందీ ఏర్పాట్లలో నిమగ్నమైంది.

జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

● ఎనిమిది రోజులు.. 200 బస్సులు.. 400 ట్రిప్పులు
● ఈ నెల 9 నుంచి 16 వరకు..
● మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం

హన్మకొండ/ఎస్ఎస్ తాడ్వాయి : ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో జరగనున్న మినీ జాతరకు టీజీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ మేరకు అధికారులు ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి బస్సులు నడపనున్నారు. ఎనిమిది రోజులు.. 200 బస్సులు.. 400 ట్రిప్పులు నడిపేలా ప్రణాళిక రూపొందించారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా అప్పటికప్పుడు బస్సులు పంపేందుకు సమాయత్తమయ్యారు. ఈ నెల 9 నుంచి ఉదయం 6 గంటల నుంచి హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి మేడారానికి బస్సులు నడపనున్నారు. 9న 15 బస్సులు, 10న 10, 11న 10, 12న 20, 13న 25, 14న 50, 15న 20, 16న 50 బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వీటితో పాటు అవసరమైతే అదనపు బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం..

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ప్రత్యేక బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం అమలు చేయనున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హనుమకొండ, మేడారం బస్ స్టేషన్లలో రోజూ డిపో మేనేజర్‌తో పాటు ఇద్దరు కంట్రోలర్లు ప్రత్యేక బస్సుల ఆపరేషన్ పర్యవేక్షిస్తారు.

భక్తులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మేడారం మినీ జాతరకు వెళ్లే భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణికుల రద్దీని బట్టి హనుమకొండ నుంచి రోజూ 24 గంటల పాటు ప్రత్యేక బస్సులు నడుపుతాం. భక్తులను క్షేమంగా చేరవేయడమే లక్ష్యం. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఆర్థికంగా నష్టపోవద్దు. ప్రమాదాలకు గురి కావొద్దు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించి వనదేవతలను దర్శించుకోవాలి. వివరాలకు ఆర్టీసీ హనుమకొండ బస్ స్టేషన్ ఎంక్వైరీ 9959226056 నంబర్‌లో సంప్రదించాలి.

–డి.విజయ భాను, ఆర్టీసీ ఆర్ఎం, వరంగల్

మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఈనెల 7,8,9 తేదీల్లో జరగనున్న మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్‌ను హైదరాబాద్‌లో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ ఈ.శ్రీధర్ ఆవిష్కరించారు. మంగళవారం ఆర్జేసీ రామకృష్ణారావు, ఈఓ ఎస్.మహేశ్, ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్ర శర్మ హైదరాబాద్ వెళ్లి వేర్వేరుగా వాల్‌పోస్టర్‌ను ఉన్నతాధికారులతో ఆవిష్కరింపజేశారు. అనంతరం ఆహ్వాన పత్రికలు అందజేశారు.

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాప్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: అధ్యాపకులు పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తూ.. అకడమిక్ పరంగా ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కేయూ సెనెట్‌హాల్‌లో మంగళవారం అన్నివిభాగాలు, యూనివర్సిటీ కళాశాలల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల, ప్రొఫెసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అటెండెన్స్ కోసం ఫేస్ రికగ్నైజేషన్ టెక్నాలజీని అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్‌గా మార్చేలా ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. కే హబ్‌లోని పరిశోధన కేంద్రాలకు రూ.15 కోట్లు మంజూరైన నేపథ్యంలో పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.31 కోట్ల బడ్జెట్ ఉత్తర్వులు వచ్చాయన్నారు. అధ్యాపకులు, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పీఆర్‌సీ ఏరియర్స్‌ను మార్చి వరకు బకాయిలు లేకుండా చెల్లిస్తామన్నారు. రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడారు.

లెర్నింగ్ నిరంతర ప్రక్రియ..

లెర్నింగ్ నిరంతర ప్రక్రియ అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. రెండు వారాలుగా ఇంటెన్సివ్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్సెల్ టూ పవర్ బీఐఫర్ ఎన్‌సీసీ జవాన్ల శిక్షణ కార్యక్రమం మంగళవారం కంప్యూటర్ సైన్స్ విభాగంలో ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శిక్షణ పొందిన జవాన్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ రామచంద్రం, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి రమ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లారెడ్డి, డాక్టర్ మంజుల, డాక్టర్ రమేశ్, నీలిమ, సలోని ఫాతిమా, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పృథ్వీరాజ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి తక్కువ నిధులు

● ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారని, మరిన్ని నిధులు కేటాయిస్తే బాగుండేదని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కళాశాలలోని ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చర్చలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేతన జీవులకు సంవత్సరానికి రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం ఊరటనిచ్చే అంశమని తెలిపారు. ఎకనామిక్స్ విభాగం ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్‌తో సామాన్యులు ఏమీ లాభంలేదని తెలిపారు. ఉద్యోగ రంగాలకు కేటాయింపులు లేవన్నారు. బీసీ జాక్ చైర్మన్ డాక్టర్ తిరునహరిశేషు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాయపరిచిన ఘటనలో ఇద్దరికి జైలు

మహబూబాబాద్ రూరల్ : ఓ వ్యక్తిని గాయపరిచిన ఘటనలో ఇద్దరికి ఏడాది చొప్పున జైలు శిక్ష, రూ. 4 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తిరుపతి మంగళవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి చిగురు నరేందర్ కథనం ప్రకారం.. 2018 అక్టోబర్ 26వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం (వి)లో వినాయక చవితి సందర్భంగా చిలుముల నరేశ్ నృత్యం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వేముల శ్రీనివాసరెడ్డి, ఆరెందుల కుమారస్వామి.. నరేశ్‌తో వాగ్వాదానికి దిగి అతడిపై దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై నరేశ్ అదే రోజు కేసముద్రం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై బి.సతీశ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించి 2019 జనవరి 7వ తేదీన కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలత కోర్టులో వాదనలు వినిపించగా ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్ రాజు ఆధ్వర్యంలో సీడీఓ నరేందర్ సాక్షులను ప్రవేశపెట్టారు. వాదనలు విన్న ఏ.జే.ఎఫ్.సీ.ఎం తిరుపతి.. నేరం నిరూపణ కాబడిన శ్రీనివాసరెడ్డి, కుమారస్వామికి ఏడాది చొప్పున జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పలు రైళ్లకు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్

● 5 రైల్వే స్టేషన్లలో 10 రైళ్లకు..

కాజీపేట రూరల్ : కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్లలో పలు రైళ్లకు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్ కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు. ఆయా రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కొనసాగుతున్న రైళ్లకు ప్రయోగాత్మక హాల్టింగ్ మరో 6 నెలల పాటు పొడిగించినట్లు తెలిపారు.

హాల్టింగ్ కల్పించిన రైళ్లు ఇవే..

వరంగల్‌లో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి చెన్నై సెంట్రల్–హజ్రత్‌నిజాముద్దీన్ (12611) ఎక్స్‌ప్రెస్, బెల్లంపల్లిలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి హజ్రత్‌నిజాముద్దీన్–తిరుపతి (12708) ఎక్స్‌ప్రెస్, ఖమ్మంలో ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఎర్నాకులం–పాట్నా (22669) పాట్నా ఎక్స్‌ప్రెస్, పెద్దపల్లిలో ఫిబ్రవరి 4 తేదీ నుంచి చెన్నై సెంట్రల్–అహ్మదాబాద్ (12656) నవజీవన్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 3వ తేదీ నుంచి అహ్మదాబాద్–చెన్నై సెంట్రల్ (12655) నవజీవన్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 4వ తేదీ నుంచి సికింద్రాబాద్–హిసర్ (22737) ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 6వ తేదీ నుంచి హైదరాబాద్–రక్సోల్ (17006) రక్సోల్ ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 9వ తేదీ నుంచి రక్సోల్–హైదరాబాద్ (17005) రక్సోల్ ఎక్స్‌ప్రెస్, నెక్కొండలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి సికింద్రాబాద్–గుంటూరు(12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు–సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లకు 6 నెలల పాటు ఎక్స్‌పర్మెంటల్ హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.